క్లుప్తంగా

ధర్మవరం కుడి కాలువకు నీరు విడుదల చేయండి

కూడేరు: పీఏబీఆర్ డ్యాం నుంచి ధర్మవరం కుడికాలువకు నీరు విడుదల చేయాలని మరుట్ల, జల్లిపల్లి, కూడేరు, కలగళ్ల, ఉదిరిపికొండకు చెందిన రైతులు అధికారులను కోరారు. మంగళవారం ఆయా గ్రామాలకు చెందిన పలువురు రైతులు విలేకరులతో మాట్లాడారు. కుడి కాలువ గుండా నీరు ప్రవహిస్తే వ్యవసాయ బోర్లలో భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు తెలిపారు. నీటి కొరతతో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసుకోలేక పోతున్నామని ఆవేదన చెందారు.

నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు



విడపనకల్లు వద్ద నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఉరవకొండ: విడపనకల్లు పరిసరాల్లోని కొండ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ సీఐ రవిచంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. కొండ ప్రాంతంలో బట్టీలు ఏర్పాటు చేసి, నాటుసారా తయారు చేస్తూ వ్యాపారాలు చేస్తున్నారన్న సమాచారంతో దాడులు చేశారు. దాడుల్లో 200 లీటర్ల ఊటబెల్లం ధ్వంసం చేసి, 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. సారా వండుతున్న విడపనకల్లు కు చెందిన గంగమ్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్ఐ వీరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీతో మందులు, పరికరాలు అందించాలి



మరుట్లలో సబ్సిడీతో పనిముట్లు ఇవ్వాలని అడుగుతున్న రైతులు

కూడేరు: సబ్సిడీతో వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు, సూక్ష్మ పోషకాలైన జింక్ సల్ఫేట్, జిప్సం, బోరాన్, తెగుళ్ల నివారణకు మందులు ఇవ్వాలని మరుట్ల-1,2,3 కాలనీలకు చెందిన రైతులు వ్యవసాయాధికారులను కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఏఓ విజయ కుమార్ రైతులకు చెప్పారు. మంగళవారం మండలంలోని మరుట్ల-1,2, 3 కాలనీల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ టీఏ శ్రీనివాసులు , వీఏఏ నారాయణమ్మ, వీఏహెచ్ఏ యశోద, గ్రామ అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదాలను అరికడదాం



రోడ్డు భద్రతా వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఆర్టీఓ రమేష్‌బాబు

కుందుర్పి: రోడ్డు ప్రమాదాలను అరికడదామని కళ్యాణదుర్గం ఆర్టీఓ రమేష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం కుందుర్పిలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ఫాదర్ ఫెర్రర్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాహన డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, లైన్ ఇన్‌స్పెక్టర్ స్వేతబిందు, ఎంపీపీ కమలమ్మ, జెడ్పీటీసీ రాధాస్వామి, వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవి ఆలయ ధర్మకర్త గట్టు శ్రీరాములు మృతి



గట్టు శ్రీరాములు (ఫైల్)

రాయదుర్గంటౌన్: పట్టణంలోని నేసేపేటలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయ ధర్మకర్త గట్టు శ్రీరాములు(82) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుమారులు సురేష్, శ్రీనివాసులు తెలిపారు. ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేసిన అనంతరం ఆలయ ధర్మకర్తతోపాటు తొగటవీరక్షత్రియ కులస్తుల అభివృద్ధికి కృషి చేశారు. గట్టు శ్రీరాములు మృతిపై ఆలయ కమిటీ అధ్యక్షులు సిరుమాలు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు మద్దిలేటి ప్రభాకర, కార్యదర్శి పురిడి హనుమంతు, కోశాధికారులు మద్దిలేటి సత్యనారాయణ, గుద్దిటి లోకేష్, కమిటీ సభ్యులు రంగం రాజు, శివప్ప తదితరులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బుధవారం రాయదుర్గంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మధ్యాహ్నం వంట..ధరల మంట

ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్నాం..

'ప్రస్తుతం పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు అందిస్తున్న భోజనం రుచికరంగా, నాణ్యతగా లేదు. పాఠశాలలో అందించే భోజనం కన్నా ఇంటి భోజనమే బాగుంది. దీంతో ఇంటికెళ్లి భోజనం చేసి వస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో మధ్యాహ్న భోజనం రుచికరంగా, పోషక విలువలతో అందించేవారు'.. ఇదీ కంబదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని ఆవేదన.

ఏజెన్సీ నిర్వహణ కష్టంగా మారింది..

'గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేశాం. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మాకు పార్టీ నాయకులు మధ్యాహ్న భోజన ఏజెన్సీని ఇప్పించారు. ఏజెన్సీ ఉంటే ఉపాధి పొందొచ్చని తీసుకున్నాం. తీరా ఏజెన్సీ తీసుకున్నా ఎలాంటి ఉపయోగం లేదని తెలిసింది. నిత్యావసర ధరలు మండుతున్నాయి. దీంతో నాణ్యతగా రుచికరంగా భోజనం అందించాలంటే కష్టంగా మారింది. ఏజెన్సీ నిర్వహించడం మాకు నష్టమే తప్ప.. లాభంలేదు. 'ఇదీ శెట్టూరు మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలి ఆవేదన.



కంబదూరులో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

- భారంగా మధ్యాహ్న భోజన పథకం అమలు
- మండుతున్న నిత్యావసర ధరలు
- ఇప్పటికీ పాత మెనూ ధరలే
- విద్యార్థులకు అందని పౌష్టికాహారం



మధ్యాహ్న భోజనం మెనూ పట్టిక



మధ్యాహ్న భోజన సమయంలో చేసిన నీళ్ల చారు

కంబదూరు: సామాన్య మధ్య తరగతి ప్రజలతోపాటు పాఠశాలల్లోనూ ధరల మంట తగులుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసి, మనబడి నాడు- నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చింది. దీంతోపాటు పౌష్టిక విలువతో కూడిన ఆహారాన్ని అందించేది. అప్పట్లో తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడులకే పంపేందుకు ఆసక్తి చూపేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక నిత్యావసర ధరలతోపాటు అన్ని రకాల ధరలూ ఆకాశాన్నంటుతున్నాయి. ఏజెన్సీ నిర్వాహకులకు వంట భారంగా మారింది. అప్పు చేసి, పిల్లలకు భోజనం చేసి పెడుతున్నా.. బిల్లులు సకాలంలో అందక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. దీంతో శుచికరమైన, నాణ్యమైన భోజనం పిల్లలకు అందడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కళ్యాణదుర్గం అర్బన్, కళ్యాణదుర్గం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల్లో 269 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 35,535 మంది విద్యార్థులు చదువుతున్నారు. 270 మధ్యాహ్న భోజన ఏజెన్సీలు ఉన్నాయి.

భోజనం తినలేక విద్యార్థులు అవస్థలు..

ప్రభుత్వ ప్రకటించిన మెనూ మేరకు సోమవారం అన్నం, పప్పు చారు, ఎగ్ కర్రీ, చిక్కీ, మంగళవారం పులిహోరా, టమాట పప్పు, గుడ్డు, బుధవారం విజిటబుల్ రైస్, ఆలూకూర్మా, గుడ్డు, చిక్కీ, గురువారం కిచిడీ, పెసరపప్పు అన్నం, టమాట చెట్నీ గుడ్డు, శుక్రవారం అన్నం, ఆకుకూర పప్పు, గుడ్డు, చిక్కీ, శనివారం అన్నం, సాంబార్, స్వీట్ పొంగాల్ పెట్టాలి. ఇందు కోసం ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థికి రూ.5.88, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.8.57 దాకా నిర్వాహలకు అందిస్తున్నారు. మెనూ ధరలు గత ప్రభుత్వంలోనివే. ఈ ప్రభుత్వం ఇంకా ధరలు పెంచలేదు. కేవలం పాఠశాలల విద్యార్థులకు మాత్రం 44 పైసాలు మాత్రమే ప్రభుత్వం పెంచింది.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య, ఏజెన్సీల వివరాలు ఇలా..

మండలం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య	ఏజెన్సీలు
కళ్యాణదుర్గం	59	11,164	56
కుందుర్పి	53	6,764	64
కంబదూరు	58	5,098	58
శెట్టూరు	56	5,831	50
బ్రహ్మసముద్రం	43	6,678	42

త్వరలో మెనూలో మార్పులు

ప్రస్తుతం మధ్యాహ్న భోజనం పథకంలో ఉన్న మెనూతో పాటు ధరలను కూడా ప్రభుత్వం త్వరలో మారుస్తున్నట్లు మాకు సమాచారం ఉంది. మండలంలోని అన్ని పాఠశాలలోనూ మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలని, మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని తయారు చేసి పెట్టాలని అన్ని ఏజెన్సీల సభ్యులకు సూచించాం.

– మదన్‌మోహన్, మండల విద్యాధికారి, కంబదూరు

ప్రభుత్వం ఇచ్చే డబ్బు సరిపోవడంలేదు..

ప్రస్తుతం నిత్యావసర వస్తువులు, కూరగాయలు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో నిర్వాహకులకు ఖర్చులు పెరిగాయి. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపోవడం లేదు. ఫలితంగా మధ్యాహ్న భోజనంలో నాణ్యత తగ్గింది. దీంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తినలేక అవస్థలు పడుతున్నారు. మరోవైపు గతంలో మాదిరిగా బిల్లులు తంచన్‌గా అందడం లేదు. తద్వారా నిర్వాహకులు అప్పు చేసి మధ్యాహ్న భోజనాన్ని తయారు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బాధిత కుటుంబాలకు విశ్వ పరామర్శ



ఎర్రన్న కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి



చిన్నహోతూరులో సర్పంచు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: మండలంలోని చిన్నహోతూరులో స్థానిక సర్పంచు బాల్యం సుంకులమ్మ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇటీవల కొద్దిరోజుల క్రితం సర్పంచు బాల్యం సుంకులమ్మ కుమార్తె బి.ఝాన్సీలక్ష్మీబాయి (36) అనారోగ్యంతో మృతిచెందింది. ఝాన్సీలక్ష్మీబాయికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. విశ్వేశ్వరరెడ్డి మంగళవారం చిన్నహోతూరుకు వెళ్లి సర్పంచు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఝాన్సీ లక్ష్మీబాయి కొడుకులను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి, ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు విజయ్ కుమార్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, మండల పార్టీ కన్వీనర్ సోమశే ఖర్‌రెడ్డి, మాజీ దేవాలయ కమిటీ చైర్మన్ రాకెట్ల అశోక్, కురుబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కాడికి గోవిందు, నాయకులు ప్రసాద్‌రెడ్డి, రవికాంతరెడ్డి, పూజారి సురేష్, సుభాష్, గోవర్ధన్, నాగేంద్ర, వన్నూరప్ప, పరమేశ్, పరమేష్, తిమ్మారెడ్డి, కరిబసి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాల్యం ఎర్రన్న కుటుంబానికి పరామర్శ

ఉరవకొండ: విడపనకల్లు మండలం గడేకల్లుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, వాల్మీకి నేత మాల్యం ఎర్రన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఎర్రన్న కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఎర్రన్న కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఎర్రన్న తనతోపాటు కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొన్నాడని, వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. చివరి వరకు ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు లాలెప్పను పరామర్శించారు. నాయకులు వీరన్న, అశోక్, కరణం భీమిరెడ్డి, లత్తవరం గోవిందు, సర్పంచ్ ఉమా శంకర్, ఎంపీటీసీ ఓబుళేసు, మాజీ ఎంపీటీసీ ప్రసాద్, హంపయ్య, వన్నూర్‌స్వామి, తిక్కన్న, ధనంజయరెడ్డి, శివారెడ్డి, రాముడు, రామాంజనేయులు, భీమలింగ, నాగరాజు, నెట్టికల్లు, భీమేష్ పాల్గొన్నారు.

అర్బన్, రూరల్ పోలీస్ స్టేషన్లు నిర్మించండి

- హోంమంత్రి అనితను కోరిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



రాష్ట్ర హోం మంత్రిని కలిసి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: ఉరవకొండ అర్బన్, రూరల్ సర్కిల్ కార్యాలయాలు ఒకే చోట కొనసాగుతున్నాయని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నూతన పోలీసు స్టేషన్లు నిర్మించాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి కోరారు. మంగళవారం నగరంలో ప్రొబేషనరీ డీఎస్పీల ట్రెనీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రితోపాటు డీజీపీ ద్వారకా తిరుమలరావును ఎమ్మెల్సీ వేర్వేరుగా కలిశారు. పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉరవకొండ పోలీస్‌స్టేషన్ పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, అందులో కార్యకలాపాలు నిర్వహించడం కష్టంగా మారిందన్నారు. పాత స్టేషన్ స్థానంలో అర్బన్, రూరల్ స్టేషన్లు నిర్మిస్తే ప్రజలకు ఎంతో వెసులుబాటుగా ఉంటుందన్నారు. దీనికి మంత్రి సానుకులంగా స్పందించి, తగు చర్యలకు ఆదేశాలు జారీ చేస్తామని ఎమ్మెల్సీకు హామీ ఇచ్చారు.

ఉరవకొండలో కరువు కనిపించలేదా?

- మండల మీట్‌లో అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు



ఉరవకొండను కరువు మండలంగా ప్రకటించాలని వినతిపత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు

ఉరవకొండ: వర్షాభావంతో పంటలు తుడిచిపెట్టుకుపోయాయని, ఉపాధి లేక గ్రామాలన్నీ వలసవెళ్లాయని, ఇంతటి దుర్భర పరిస్థితులున్నా.. ఉరవకొండను కరువు మండలంగా ప్రకటించకపోవడం దారుణమని ప్రజాప్రతినిధులు నిలదీశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన వాడీవేడీగా మండల సర్వ సభ్యసమావేశం జరిగింది. ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, మేజర్ పంచాయతీ సర్పంచు లలితమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు. ముందుగా ఉరవకొండను కరువు మండలంగా ప్రకటిస్తూ తీర్మానం చేయాలని మండలమీట్‌లో సభ్యులు అధికారులను నిలదీశారు. ముందుగా మాజీ ఎంపీటీసీలు చందా చంద్రమ్మ, ఈడిగ ప్రసాద్, వన్నూర్‌సాబ్ మాట్లాడుతూ ఉరవకొండలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అనంతరం ఏఓ మాట్లాడుతుండగా సర్పంచ్ యోగేంద్రరెడ్డి కలగజేసుకొని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేదని, కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రైతులు చెల్లించాలని నిబంధనలు పెట్టడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. ఈఏడాది ప్రభుత్వం పెట్టుబడి సహాయం ఇస్తామని మోసగించడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. దీంతో పాటు విద్యుత్ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సభ్యులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ఈఏడాది ప్రభుత్వం పెట్టుబడి సహాయం ఇస్తామని మోసగించడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. దీంతో పాటు విద్యుత్ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సభ్యులు డిమాండ్ చేశారు.

మంత్రి లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



ఉరవకొండలో నిరసన ర్యాలీ చేస్తున్న ఇంటర్ విద్యార్థినులు

ఉరవకొండ: యువగళం పాదయాత్రలో ఇంటర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేసి, వారికి నాణ్యమైన విద్య అందేలా చేస్తామని ఇచ్చిన హామీని మంత్రి నారాలోకేష్ నిలబెట్టుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, సహాయ కార్యదర్శి వెంకట్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇంటర్ కళాశాలలో మధ్యాహ్నం భోజన పథకం అమలు చేయాలని, విద్యాదీవెన, వసతి దీవెన పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్న తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన తెలియజేశారు. ఉరవకొండలో భారీ ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్ మహబూబ్‌బాషాకు నాయకులు వినతి పత్రం అందించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు హరూన్ రషీద్, చందు, లెనిన్, పాల్గొన్నారు.

పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలి

రాయదుర్గంటౌన్: పశువులను రోడ్లపై వదిలేసిన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో వాటిని రైతులకు అప్పగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గోరక్షక దళం అధ్యక్షుడు కేడీమి ప్రశాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డితో చర్చించారు. పశువుల సంచారంపై కొన్ని డిమాండ్లను అధికారుల దృష్టికి తెచ్చారు. యజమానులను గుర్తించి రోడ్లపై వదలకుండా చూసేందుకు నోటీసులు జారీ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. యజమానులు స్పందించకపోతే, వారు గోవులు వద్దు అనుకుంటే వాటిని గోరక్షక దళం ఆధ్వర్యంలో రైతులకు అప్పగించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గోరక్షక దళం సభ్యులు మోహన్, పవన్, మంజు, జిత్తు, నితిన్ తదతరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నిబంధనలు పాటించకపోతే చర్యలు

కళ్యాణదుర్గం: ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రవిబాబు తెలిపారు. మంగళవారం స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటో డ్రైవర్లలో చాలా మందికి డ్రైవింగ్ లైసెన్స్ నంబర్ ఉండదని, ఆటోలకు ఇన్సూరెన్స్ లేకుండానే వాహనాలను నడుపుతున్నారని మండిపడ్డారు. రోజూ సిబ్బంది ఆటో రికార్డులను తనిఖీ చేసి రికార్డులు లేని వాటికి అపరాధ రుసుం విధించాలని పట్టణ సీఐ వెంకటరమణను ఆదేశించారు.

సాగునీటి వనరుల కోసం నిధులు కేటాయించాలి

రాయదుర్గంటౌన్: త్వరలో జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో అనంతపురం జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధి, తుంగభద్ర ఎగువ కాలవ ఆధునికీకరణ, హంద్రీనీవా కాలువ పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేసేందుకు నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ నెలలో జరిగే సమావేశాల్లో అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని సాగునీటి వనరుల అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించాలని కృషి చేయాలన్నారు. ఈ మేరకు మంగళవారం సీపీఎం మల్లికార్జున, నాయకులు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును కలిసిందేందుకు వెళ్లగా అందుబాటులో లేకపోవడంతో పీఏకు వినతిపత్రం అందజేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

బొమ్మనహాళ్: త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం భగవద్గీత ప్రచారం చేశారు. మండలంలోని గోవిందవాడ గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఉరవకొండ కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు, సభ్యులు వీరేంద్ర, కృష్ణవేణి, ఉమాదేవి, ప్రవల్లిక, సుజిత, సువర్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

కళ్యాణదుర్గం రూరల్: అపార్ ఐడీ నమోదు ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం తగదని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ నూతన విద్యావిధానంలో భాగంగా ఒకే దేశం ఒకే ఐడెంటిటీ పేరుతో దేశ వ్యాప్తంగా విద్యార్థులకు ఒకే ఐడీ క్రియేట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి అపార్ ఐడీ నమోదుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు మల్లికార్జున, ఆనంద్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు రవి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరం కంటింజెంట్ ఇన్‌చార్జ్‌గా శ్రీధర్

కళ్యాణదుర్గం రూరల్: జాతీయ సమైక్యత శిబిరం కంటింజెంట్ ఇన్‌చార్జ్‌గా ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ పీఓ కె.శ్రీధర్ ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ జయరాంరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నార్త్ గుజరాత్ పాఠాన్‌లోని హేమచంద్రాచార్య విశ్వావిద్యాలంలో ఈనెల 8 నుంచి 14 వరకు జరగనున్న ఇంటిగ్రేషన్ క్యాంపు (ఎన్ఐసీ)నకు ఆంధ్రప్రదేశ్ నుంచి పదిమంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హాజరవుతున్న ఎస్కేయూ టీమ్‌కు కంటింజెంట్ ఇన్‌చార్జ్‌గా శ్రీధర్ ఎంపికయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సూర్యనాగిరెడ్డి,ఎన్ఎస్ఎస్ అధికారి రవిశంకర్, అధ్యాపకులు శ్యాంప్రసాద్, సుధాకర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు ఇండియా ఓబయ్య 17వ వర్ధంతి

కళ్యాణదుర్గం: స్వాతంత్ర్య సమరయోధుడు, కీర్తిశేషులు ఇండియా ఓబయ్య 17వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఓబయ్య కుమారుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఐ.సుధీర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు స్థానిక టీ సర్కిల్‌లో ఉన్న ఇండియా ఓబయ్య విగ్రహం వద్ద నివాళులర్పించనున్నట్లు తెలిపారు.

గోనబావి రంగస్వామికి ప్రతిభా అవార్డు



రంగస్వామిని సన్మానిస్తున్న కళాకారులు

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావికి చెందిన పోగునూలు రంగస్వామి మంగళవారం ప్రతిభా అవార్డు అందుకున్నాడు. పౌరాణిక నాటక రంగంలో వివిధ పాత్రలు పోషించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన రంగస్వామికి తెలుగు కళా రత్నాలు సేవా సంస్థ విజయవాడ ఆధ్వర్యంలో అవార్డు అందించి, సన్మానించారు.

గాయపడిన యువకుడికి పరామర్శ



సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వన్నూర్‌స్వామిని పరామర్శిస్తున్న రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని పాల్వాయి గ్రామానికి చెందిన వన్నూరస్వామి అనే యువకుడిపైన అదే గ్రామానికి చెందిన వ్యక్తి సోమవారం రాత్రి దాడి చేసిన విషయం విదితమే. దాడిలో తీవ్రంగా గాయపడి అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వన్నూరస్వామిని వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయ కర్త తలారి రంగయ్య మంగళవారం పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు రంగయ్య సూచించారు. మాజీ ఎంపీ వెంట పాలవాయి సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు నాగభూషణ్, రామాంజనేయులు, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై మెరుపుదాడి



నిందితులను చూపుతున్న సీఐ వెంకటరమణ

సాక్షి ఎఫెక్ట్..

డి హీరేహాళ్ (రాయదుర్గం): పేకాట స్థావరాలపై రూరల్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో డీ హీరేహాళ్ పోలీసులు మంగళవారం మెరుపు దాడులు చేశారు. సరి 'హద్దులు' దాటిన జూదం శీర్షికను 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితమైంది. అందుకు జిల్లా ఎస్పీ జగదీష్, కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు స్పందించారు. వారి ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన రూరల్ సీఐ స్థానిక ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డితో కలసి సరిహద్దు ప్రాంతాల్లో గస్తీ నిర్వహించారు. డీ హీరేహాళ్ సమీపాన వంకలో పేకాట శిబిరాన్ని చుట్టుముట్టి, చాకచక్యంగా 13 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.26,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ మట్కా, పేకాట లాంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపామన్నారు. మట్కా, పేకాటను శాశ్వతంగా అరికట్టేందుకు కృషి చేస్తామన్నారు. పేకాట శిబిరాలు గుర్తిస్తే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

స్కౌట్స్‌లో రాజ్య పురస్కార్‌కు రామసాగరం విద్యార్థి



విద్యార్థి జీ ధనుష్

బొమ్మనహాళ్: రామసాగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి జీ. ధనుష్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణలో ఉత్తమ ప్రతిభ సాధించి రాజ్య పురస్కార్ ప్రమాణ పత్ర ప్రదానోత్సవానికి ఎంపికయినట్లు హెచ్ఎం మురళీధర్‌మూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల పూలకుంటలో జరిగిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చాటి, ఉమ్మడి అనంత జిల్లా తరపున ఎంపికయినట్లు హెచ్ఎం తెలిపారు. ఈనెల 7న విజయవాడలో గవర్నర్ చేతుల మీదుగా ధనుష్ రాజ్యపురస్కార్ పత్రాన్ని అందుకుంటాడన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

కణేకల్లు: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్, యర్రగుంట పీహెచ్‌సీ డాక్టర్ విజయకుమార్ సిబ్బందికి సూచించారు. మంగళవారం యర్రగుంట పీహెచ్‌సీలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం గ్రామంలో సీజనల్ వ్యాధులపై ర్యాలీ నిర్వహించారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏఈఎస్ ఎస్.రేవతి

కణేకల్లు: బెల్టుషాపుల పేరిట ఊరూరా మద్యం అమ్మితే ఊపేక్షించేది లేదని ఏఈఎస్ (అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్) ఎస్.రేవతి హెచ్చరించారు. మంగళవారం కణేకల్లు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను ఏఈఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్సైజ్ సీఐ ఉమాబాయితో కలిసి ఏఈఎస్ విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక నుంచి ఎన్‌డీపీఎల్ అక్రమ రవాణా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం సరిహద్దు ప్రాంతాల్లో మూడు పర్మినెంట్ చెక్‌పోస్టులున్నాయని, అక్కడ సిబ్బంది రేయింబవళ్లు పనిచేస్తూ జిల్లాలోకి అక్రమ మద్యం సరఫరా కాకుండా కట్టడి చేస్తున్నట్లు తెలిపారు. ఓబుళాపురం, డోనేకల్లు, విడపనకల్లు ప్రాంతాల్లో పర్మినెంట్ చెక్‌పోస్టులున్నాయన్నారు. వీటితోపాటు ఆంధ్రా-కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో రెండు మొబైల్ పెట్రోలింగ్ బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేయిస్తున్నాయన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంటు వింగ్ ఫోర్స్, ఎక్సైజ్ టాక్స్‌ఫోర్స్‌లు కూడా కర్ణాటక మద్యం సరఫరా కాకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాయన్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు ఎవరూ నిర్వహించినా ఊపేక్షించేది లేదని హెచ్చరించారు. వైన్స్‌షాపు బయట మద్యం రేట్లను డిస్‌ప్లే చేయిస్తామని ఎమ్మార్పీ కంటే అధికరేట్లతో మద్యాన్ని విక్రయిస్తే షాపు యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్‌డీపీఎల్ (కర్ణాటక మద్యం) నియంత్రణ కోసం వైన్స్‌షాపులో తక్కువ ధరకు రూ.99లకు లభించే మద్యాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు.